క్లుప్తంగా

గవరపాలెంలో వైద్యశిబిరం



గవరపాలెంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శశి ప్రియాంక

కె.కోటపాడు : వర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల గవరపాలెం గ్రామంలో మంగళవారం సంచార వైద్య చికిత్స శిబిరాన్ని జరిపారు. 133 మందికి ఆరోగ్య పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు.

డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వం



కిల్లాడ శ్రీనివాసరావు

నర్సీపట్నం: డిగ్రీ విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడకుండా డిగ్రీ అడ్మిషన్లు అలాట్ చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్మిషన్లు జరగకపోతే తరగతులు ఎప్పుడు ప్రారంభిస్తారన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఓఎండీసీపీ పోర్టల్‌లో నమోదు చేసుకుని నెల రోజులు కావస్తున్నా సీట్లు అలాట్ చేయలేదన్నారు. ఇంజినీరింగ్ ప్రవేశాలు దాదాపు పూర్తయి, తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. నియోజకవర్గంలో 2 వేల మంది విద్యార్థులు డిగ్రీలో జాయిన్ అయ్యేందుకు నిరీక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం తీరుతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు.

శరభవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఆపరేషన్‌కు ఎంపికయిన వారిని విశాఖ తరలించేందుకు ఏర్పాటు చేసిన బస్

రోలుగుంట : శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి ఆధ్వర్యంలో శరభవరం గ్రామంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని రామ మందిరం వద్ద నిర్వహించారు. గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన 56 మందికి నేత్ర వైద్య నిపుణురాలు అరుణ చికిత్సలు అందించారు. 29 మందికి కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. వారిని బస్‌లో విశాఖలోని శంకర్ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న లోచన సుజాత

గొలుగొండ : ఏఎల్‌పురం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు స్థానిక సర్పంచ్ లోచల సుజాత శంకుస్థాపన చేశారు. ఈ పంచాయతీలో అభివృద్ధి పనులకు జడ్పీటీసీ సభ్యులు సుర్ల గిరిబాబు రూ.5 లక్షలు మంజూరు చేయడంతో ఈ నిధులతో డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నట్టు సుజాత తెలిపారు. ఇచ్చిన నిధులతో సుమారుగా 200 మీటర్ల డ్రైనేజీ పనులు చేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మామిడి కృష్ణతో పాటు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చిటికెల వివేకనందనాయుడు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు



తుప్పలను దగ్గరుండి తొలగిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం : ప్రమాదకరంగా మారిన రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను మంగళవారం నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు దగ్గరుంచి తొలగింపజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నర్సీపట్నం, తుని మధ్య డి.యర్రవరం నుంచి జిల్లేడుపూడి వెళ్లే రోడ్డులో తాండవ జంక్షన్, నాతవరం మధ్య అర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు రోడ్డు మార్జిన్ కప్పివేస్తూ పెరిగిపోవడంతో తరుచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ దగ్గరుండి తుప్పలను పొక్లెయిన్‌తో తొలగింపజేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంపై చర్యలు

రావికమతం : గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టని పంచాయతీల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సీతారామస్వామి మంగళవారం హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో మండలంలో 12 పంచాయతీల్లో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని ఆయా గ్రామస్తులు నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు.

చదువులతల్లికి అపూర్వ వందనం



పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేసిన పాఠశాల పూర్వ విద్యార్థులు

- పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా పూర్వ విద్యార్థులు
- ఎ.కోడూరు హైస్కూల్లో మౌలిక వసతుల కల్పన
- బుద్ధుని విగ్రహం ఏర్పాటు, మైక్‌సెట్ వితరణ
- ఆర్‌వో ప్లాంట్, స్టేజ నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



పూర్వ బ్యాచ్ విద్యార్థులు నిర్మాణం పూర్తి చేసిన పాఠశాలలో స్టేజ



ఎ.కోడూరు పాఠశాలలో 1988-89 బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు (ఫైల్)

కె.కోటపాడు : పుట్టిన గ్రామాన్ని, చదువుకున్న పాఠశాలను మరువకూడదని నానుడి. ఇదే విధానాన్ని మండలంలో ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువులు సాగించిన పూర్వ విద్యార్థులు అవలంబిస్తున్నారు. చదువులు పూర్తి చేసుకొని ఏళ్లు గడిచినా...మరలా వారు చదువులు సాగించిన పాఠశాల అభివృద్ధిలో బాగస్వాములు కావాలని సంకల్పించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సూచనల మేరకు వివిధ బ్యాచ్‌ల విద్యార్థులు సొంత నగదు సమీకరించుకుని పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

పాఠశాల ఆవరణలో పచ్చదనం

ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి ప్రవేశించిన వెంటనే బుద్ధుడి విగ్రహంతో పాటు ఆయా ప్రాంగణమంతా పచ్చదనంతో దర్శనమిస్తుంది. ఈ బుద్ధుడి విగ్రహంతో పాటు కడియం నుంచి తెప్పించిన మొక్కలతో ప్రత్యేక పార్కుగా పాఠశాలలో 1988–89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ బుద్ధుడి విగ్రహంతో పాటు పచ్చని మొక్కలతో పార్కుగా అభివృద్ధి చేసేందుకు వీరు రూ.లక్షా 50వేల నిధులను వెచ్చించారు. 2021లో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా బుద్ధుడి విగ్రహం, పార్కుని ప్రారంభించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ ఏడాది రూ.35వేలతో పాఠశాలకు మైక్‌సెట్‌ను అందించారు.1979–80 బ్యాచ్ విద్యార్థులు రూ.లక్షా 20వేలతో విద్యార్థులకు సురక్షిత మంచి నీటిని అందించేందుకు ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 2001–02 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.60వేల నిధులతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించి షెడ్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో ప్రత్యేక సందర్భాల్లో సమావేశాల నిర్వహణకు స్టేజీ లేకపోవడంతో పాఠశాలకు చెందిన 1089–90, 1994–95 బ్యాచ్ విద్యార్థులు రూ.2లక్షల నిధులతో స్టేజి నిర్మాణాన్ని జరిపారు. పాఠశాలలో చదువులు సాగించి ఆ పాఠశాలలోనే ఒకేషనల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వి.బంగారునాయుడు, ఆర్.వెంకటరావుతో పాటు అప్పటి ఉపాధ్యాయులు లక్ష రూపాయలతో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న పూర్వ విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.



పాఠశాలకు మైక్‌సెట్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అభినందనీయం



చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఎ.కోడూరు పాఠశాలలో చదువులు సాగించిన పలు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయం. పాఠశాలలో ఏఏ అవసరాలు ఉన్నాయో... వాటిని తీర్చడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏఏ మేలు జరుగుతుందో పలు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు వచ్చి అడిగి తెలుసుకుంటున్నారు. ఆయా బ్యాచ్‌ల విద్యార్థులు నిధులను ఏర్పాటు చేసుకుని వీటిని పాఠశాలలో సమకూర్చుతున్నారు. పాఠశాలలో బుద్ధుడి విగ్రహం, స్టేజీ, సరస్వతీదేవి విగ్రహం, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి షెడ్, ఆర్‌వో ప్లాంట్, మైక్ సెట్‌లను పలు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు సమకూర్చారు. వీరికి పాఠశాల తరపున కృతజ్ఞతలు.

– ఎ.శేఖర్, హెచ్‌ఎం, ఎ.కోడూరు హైస్కూల్

ఆనందంగా ఉంది



చదువులు సాగించిన పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులైన మేము భాగస్వాములు అవుతున్నందుకు ఆనందంగా ఉంది. ప్రతీ ఏటా ఆత్మీయ కలయిక పేరుతో 1988–89 బ్యాచ్ విద్యార్థులు కలుసుకుంటున్నాం. ఈ సమయంలో పాఠశాలకు అవసరమయిన మౌలిక వసతుల కల్పనకు మా బ్యాచ్‌లో ప్రతి పూర్వ విద్యార్థులు ముందుకు వస్తూ సొంత నగదుతో పాఠశాలలో సమకూర్చుతున్నాం. మా బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు బుద్ధుడి విగ్రహంతో పాటు ఆయా పరిసరాలు పచ్చని మొక్కలతో పార్కుగా ఏర్పాటు చేయడంతో పాటు ఇటీవల పాఠశాలకు మైక్ సెట్‌ను అందించాం.

– లెక్కల కోటేశ్వరరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, ఎ.కోడూరు

రణభేరి జాతను జయప్రదం చేయాలి

మాకవరపాలెం: ఉపాధ్యాయ సమస్యలపై చేపట్టిన రణభేరి జాతను జయప్రదం చేయాలని యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 15న ఈ జాత ప్రారంభం అయిందన్నారు. 18వ తేదీ నాటికి అనకాపల్లి చేరుకుంటుందని, ఉపాధ్యాయులు ఈ జాతను జయప్రదం చేయాలన్నారు. సిపిఎస్ రద్దు, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు, వివిధ బకాయిల విడుదల, ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతను చేపట్టారన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం : మండలంలోని జి.కోడూరు, మాకవరపాలెం ఫీడర్‌లలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి నిరంతరం విద్యుత్ సరఫరా చేసేయడంలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో తామరం, టీచర్స్ కాలనీ, జీ కోడూరు ఫీడర్ పరిధిలో రాచపల్లి, జి.నగరం, సుబ్రహ్మయ్యపాలెం, చౌడువాడ ప్రాంతాల్లో నేడు, రేపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్..గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 15 కంపెనీల్లో ఎంపికలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000092227, 8106327482 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతుబంధు పథకం సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ

నాతవరం : వ్యవసాయం సాగు చే సే రైతులంతా రైతు బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ అన్నారు. ఆయన మంగళవారం రైతులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్ కమిటీలో నిల్వ చేసుకోవచ్చని, ఆయా వ్యవసాయ ఉత్పత్తులపై బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని అన్నారు. గిట్టుబాటు ధర వచ్చే వరకు వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకోవచ్చునన్న విషయం చాలా మంది రైతులకు నేటికీ తెలియదని, వారికి అవగాహన కల్పించడానికే ఈ సదస్సు నిర్వహించామన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే నూటికి ఒక శాతం వ్యవసాయ మార్కెట్ సెస్ చెల్లించాలన్నారు. ఆ సెస్సు డబ్బులతో రైతుల పంట పొలాలకు రోడ్లు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులే కాకుండా మత్స్యశాఖ ద్వారా జరిపే క్రయ విక్రయాలు చేసే వాటికి మార్కెట్ కమిటీ సెస్సు వసూలు చేస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అందరూ సెస్సు చెల్లించి మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

సమస్యలపై సకాలంలో స్పందించాలి



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం : ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు గ్రామాల్లో సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సరుగుడులో యూరియా అందరికీ అందలేదని ఎంపీపీ ఏవో సుగుణను అడిగారు. సరుగుడు సుందరకోట పంచాయతీలో గిరిజనులు పోడు వ్యవసాయం సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. మండల వ్యాప్తంగా రెవెన్యూపరంగా అనేక అవకవతకలు జరిగాయని, దానికి సంబంధించి సమాచార హక్కు చట్టంలో దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ ఇవ్వలేదని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ సభలో అడిగారు. డీలర్లు మోతాదుకు మించి క్రిమిసంహార మందులు విక్రయిస్తున్నారని దానిని అరికట్టాలని పెదగొలుగొండపేట ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, ఎస్.బి.పట్నం సర్పంచ్ ఎల్.సత్యనారాయణ అన్నారు. సుందరకోట చిన గొలుగొండపేట, వై.బి.పట్నం, లింగంపేట పంచాయతీలకు నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయని పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ తెలిపారు. తాగునీటికి 47 పనులు మంజూరు అయితే 30 పనులు పూర్తి చేశామని రామన్నపాలెం ఎస్.బి.పట్నం, పి.ఎన్.డి పాలెం గ్రామాల్లో కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా టెండర్లు రద్దు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దత్తు తెలిపారు. మరల కొత్తగా టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తామన్నారు. మండలానికి స్మార్ట్ రేషన్ కార్డులు 21వేలకు పైగా వచ్చాయని వాటిని డీలర్ల చేత లబ్ధిదారులు పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మండల వ్యాప్తంగా భూములు రీసర్వే గతంలో చేయగా మిగిలినవి 18 రెవెన్యూ గ్రామాలను అక్టోబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. అర్హులకు అటవీ హక్కు పత్రాలు అందించేందుకు లబ్ధిదారులు జాబితా సిద్ధం చేశామన్నారు.

బీఎన్‌రోడ్డులో భారీ వాహనాలు నడిపితే జరిమానా



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

బుచ్చెయ్యపేట : బి.ఎన్. రోడ్డులో భారీ వాహనాలు నడిపితే వెంటనే జరిమానా వేయాలని పోలీసు సిబ్బందిని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అమె బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం వడ్డాది, బ్రిడ్జిని పరిశీలించారు. బీఎస్ రోడ్డులో ఆగని భారీ వాహనాలు పేరిట సాక్షిలో వచ్చిన వార్తకు డీఎస్పీ స్పందించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా డైనమిక్ రెగ్యులర్ వాహనాలను తనిఖీ చెయ్యాలని, వడ్డాది బ్రిడ్జి మీద అధిక బరువు గల వాహనాలు నడిపితే అటువంటి వాహనాలకు విధిగా ఫైన్ వేయాలని పోలీసులను ఆదేశించారు.

ప్రతి పశువుకూ గాలికుంటు టీకా వేయించాలి



రైతులకు సూచనలు చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : మూడు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని రైతులకు చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు సూచించారు. మంగళవారం చౌడువాడ, మల్లంపాలెం, పాచిలవానిపాలెం గ్రామాల్లో పశువులకు టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు గ్రామాల్లో 656 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నాయుడు మాట్లాడుతూ చౌడువాడ పశు ఆరోగ్య కేంద్రం పరిధిలో 6500 పశువులకు గాలికుంటు టీకాలను వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 15 వరకూ కొనసాగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది కనకారావు, జగన్, సంతోష్, తేజ పాల్గొన్నారు.

నర్సీపట్నం : పశువులకు గాలి కుంటు వ్యాధి టీకా విధిగా వేయించాలని నర్సీపట్నం ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ డబ్ల్యూ రాంబాబు రైతులకు సూచించారు. బలిఘట్టం, చీడిగుమ్మల, నీలంపేట గ్రామాల్లో పర్యటించి గాలి కుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలి కుంటు బారిన పడిన పశువులకు జ్వరం, నోటి పుండ్లు, కాళ్ల డెక్కలకు పుండ్లు, గర్భస్రావం, పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కొన్ని సందర్భాల్లో పాడి పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. నష్ట నివారణకు మూడు నెలలు వయసు దాటిన దూడల నుంచి చూడి పశువులు వరకు అన్ని జీవులకు టీకాలు వేయించుకోవాలన్నారు. చెట్టుపల్లి పశువైద్యాధికారి డాక్టర్ పుష్ప, కె.డి.పేట డాక్టర్ జి.వి.ఎం.శిరీష, గోపాలమిత్ర రాము ఉన్నారు.

కాలుష్యంతో ఓజోన్ పొరకు ముప్పు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, ఆర్డీవో రమణ



కె.కోటపాడు : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నారాయణరావు, హెచ్‌ఎం నాగేశ్వరరావు

నర్సీపట్నం : అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, గ్రీన్ క్లబ్ వారు విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు, ఆర్డీవో వి.వి.రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఓజోన్ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకురావడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, మాకవరపాలెం తహసీల్దార్ వెంకట రమణ, క్లబ్ వ్యవస్థాపకులు డి.గోపీనాథ్ పాల్గొన్నారు. బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గొడుగులతో ఓజోన్–3 నమూనాగా ఏర్పడి ఆవశ్యతకను తెలియజేశారు.

మాకవరపాలెం: పర్యావరణ రక్షణతోనే ఓజోన్ పొరను కాపాడుకోవచ్చని కేజీబీవీ ఎస్‌వో త్రివేణి అన్నారు. అంతరించి పోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గొండుపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్.వి.నారాయణ రావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం మంగళవారం విద్యార్థులతో కలిసి నిర్వహించారు.

చోడవరం : ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ అన్నారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా కెమిస్ట్రీ హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మీ మంగమ్మ పర్యవేక్షణలో ఓజోన్ పొర రక్షణ కోసం సైన్స్ విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను ఇక్కడ ప్రదర్శించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



తామరం విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన మణికంఠ

మాకవరపాలెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేందుకు కృషి చేయాలని నేషనల్ క్వాలిటీ ఇష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) టీం సభ్యుడు మణికంఠ వైద్య సిబ్బందికి సూచించారు. తామరం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ క్లినిక్‌లో గర్భిణులకు, రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. అలాగే జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి అమలు చేస్తున్న పథకాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మనికంఠ మాట్లాడుతూ రోగులకు అందించే సేవల్లో నాణ్యతను పెంచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యాధికారి సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సరంక్షణకు వైద్య శిబిరాలు



వివరాలు వెల్లడిస్తున్న దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు పూజ్యమేఘన, వనజ తదితరులు

కె.కోటపాడు : మహిళల ఆరోగ్య రక్షణకు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వైద్యశిబిరాలను సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.మహిళల్లో గుండె వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్ తదితర నిర్ధారిత చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మాడుగుల రూరల్: ఈ నెల 17 వ తేదీ నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలి రోజు బుధవారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఈ శిబిరం ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి రొమ్ము క్యాన్సర్, పరీక్షలతో పాటు పౌష్టికాహారం తీసుకునే విధానం, తల్లిబిడ్డలకు ఆరోగ్య పరీక్షలు, వయో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు.

దేవరాపల్లి : 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి డి.వనజ, ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు పీహెచ్‌సీ పరిధిలోని 11 హెల్త్ సెంటర్లలో వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు రక్తపోటు, మధుమేహం వివిధ క్యాన్సర్లకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వై. తారకేశ్వరరావు హితవు పలికారు. ఆయన మంగళవారం సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రైల్వే శాఖలో 50 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. ఆసక్తి గల యువకులకు అవసరమైన శిక్షణ ఇస్తానన్నారు. గ్రామా ల్లో అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించే సహించేది లేదన్నారు.

నానో యూరియా లాభదాయకం



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీదేవి

మాడుగుల : నానో యూరియా వాడితే పంట దిగుబడి బాగుంటుందని, నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి అన్నారు. మంగళవారం సత్యవరం గ్రామంలో వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 500 మి.లీ నానో యూరియా ద్రావణం ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. ఎంపీటీసీ అప్పారావు, సర్పంచ్ నాగమణి రామారావు, మండల వ్యవసాయాధికారి అనసూయ, ఆత్మా బీటీఎం లక్ష్మీ కిషోర్, ఎంఈవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం/రోలుగుంట/చీడికాడ: మాడుగుల రూరల్: రేషన్ స్మార్ట్‌కార్డులు వల్ల వినియోగదారులకు ఎంతో మంచిదని ఎమ్మెల్యే కెఎస్ఎస్ రాజు అన్నారు. దుడ్డుపాలెంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నిండుగొండలో రోలుగుంట పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి సుర్ల బాబులనాయుడు వీఆర్వోతో కలసి స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. చీడికాడ మండలంలోని పలుగ్రామాల్లో స్మార్టు రేషన్‌కార్డులను పంపిణీ చేసినట్టు తహసీల్దార్ లింకన్ తెలిపారు. మాడుగుల మండలం కె.జె.పురంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు జోగినాయుడు స్మార్ట్‌కార్డులు అందజేశారు.